సాక్షి
శ్రీకాకుళం

సోమవారం, 2, జనవరి, 2023



రహదారి సమస్యకు మోక్షం

పది గ్రామాల దారి సమస్య తీరింది. ఏడు కిలోమీటర్ల రోడ్డును కొత్తగా వేశారు.

- 8లో



ఏఓబీ గ్రామాలపై దృష్టి

ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ కేపీ గోపాల్ సాక్షితో మాట్లాడారు. ఏఓబీ గ్రామాలపై దృష్టి పెట్టినట్లు తెలిపారు.

- 8లో

సర్పంచ్ ఇంటిపై దాడిపై కేసు నమోదు

పొందూరు: పొందూరు సర్పంచ్ ఆర్.లక్ష్మి ఇంటిపై రాళ్ల దాడి చేసిన సంఘటనలో కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. గత ఏడాది డిసెంబర్ 23న ఇంటిపై రాళ్ల దాడిచేసినట్లు మోహన్, సత్తిబాబు, వెంకటరావు, గోవిందరావు, గణబాబులపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

న్యూస్‌రీల్

సామాజిక బాధ్యతతోనే పింఛన్ల పంపిణీ

గార: ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పింఛన్ మొత్తాన్ని పెంచారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం పింఛన్ కానుక పెంపు లెటర్‌లను ధర్మాన లబ్ధిదారులకు అందజేశారు. అర్హులందరికీ న్యాయం జరుగుతుందని, ఆందోళన అక్కర్లేదని చెప్పారు. పింఛన్ మొత్తం వచ్చే రోజుల్లో రూ. 3వేలు కూడా చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి నిర్మలా శ్రీనివాస్, తహసీల్దార్ ఎస్.వెంకటరావు, ఎంపీడీఓ రఘు, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం కొనుగోళ్లలో తలెత్తే సమస్యలు పరిష్కరించేందుకు డయల్ యువర్ జేసీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జనవరి 3న ఉదయం 9 నుంచి 10 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఫిర్యాదులు, సమస్యలు తెలియజేసేందుకు 78933 00311 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు, సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. వచ్చే వారం నుంచి ప్రతి మంగళ, శుక్ర వారాల్లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు డయల్‌యువర్ జేసీ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

11న సిక్కోలు జానపద కళాజాత



చిన్ననీలావతిలో కళాజాత వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో గ్రామస్తులు

పలాస/కాశీబుగ్గ: పలాస మండలం చిన్ననీలావతి గ్రామంలో ఈ నెల 11వ తేదీన జరిగే సిక్కోలు జానపద కళాజాత నిర్వహించనున్నారు. స్థానిక అమ్మవారి గుడి దగ్గర ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రం, గోడ పత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ నాయుడు సోర్ర వీరస్వామి అభ్యుదయ యువజన సంఘం అధ్యక్షులు గోరకల లోకేశ్వరరావు, సర్పంచ్ సోర్ర తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కొత్తూరు: కొత్తూరు మండలం మెట్టూరు బిట్-2 ఆర్ఆర్ కాలనీకి చెందిన పొడ్డిన రంజిత కనిపించడం లేదంటూ భర్త పొడ్డిన గోపి నాయుడు ఆదివారం కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భామిని మండలం పెద్దదిమిలిలో ఉన్న బంధువులను పరామర్శించేందుకు వెళ్తానని చెప్పి డిసెంబర్ 31న ఉదయం సుమారు 10.30 గంటలకు ఇంటి నుంచి బయల్దేరి వెళ్లిందని, కానీ తిరిగి రాలేదని ఆయన తెలిపారు. పెద్దదిమిలిలో ఉన్న బంధువుల ఇంటికి ఫోన్ చేస్తే అక్కడకు రాలేదని వారు చెప్పారని భర్త తెలిపారు. ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం ఫిర్యాదు చేశారని ఎస్ఐ ఎం.గోవింద తెలిపారు.

'ఒకే తేదీగా గుర్తించండి'

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి సీనియారిటీని అన్ని సబ్జెక్టులకు ఒకే తేదీగా పరిగణించాలని భాషోపాధ్యాయ, పీఈటీ సంఘాల నాయకులు డీఈఓ గార పగడాలమ్మ కోరారు. ఈ మేరకు ఆదివారం డీఈఓను ఆమె చాంబర్‌లో కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపి వినతిపత్రం అందజేశారు. 2019 నవంబర్ నెలలో జరిగిన భాషా పండితుల, వ్యాయామ ఉపాధ్యాయుల ఉన్నతీకరణ పదోన్నతుల్లో నవంబర్ 1వ తేదీన తెలుగు, నవంబర్ 2వ తేదీన హిందీ ఒరియా, వ్యాయామ సబ్జెక్టులకు కౌన్సిలింగ్ జరిగిందనే విషయాన్ని గుర్తుచేశారు. దీని వల్ల భవిష్యత్‌లో జరగబోయే పదోన్నతుల్లో సీనియారిటీ సమస్య ఏర్పడే అవకాశం ఉందని, అన్ని సబ్జెక్టులకు నవంబర్ 1వ తేదీనే ఉన్నతీకరణ జరిగిందని, అన్ని సబ్జెక్టులకు అదే సీనియారిటీగా పరిగణించాలని వారు కోరారు. మిగతా జిల్లాల్లో ఒకే తేదీని పరిగణించి ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు ఇచ్చినందున.. శ్రీకాకుళం జిల్లాలోను అదేమాదిరిగా ఉత్తర్వులు ఇవ్వాలని వారు కోరారు. డీఈఓను కలిసిన వారిలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు కూన రంగనాయకులు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, బీవీ రమణ ఉన్నారు.

పింఛను.. ఆనందం పెంచెను



శ్రీకాకుళంలో జగనన్న పెంచిన రూ. 2,750 పింఛను అందుకున్న ఆనందంలో సీతమ్మ



కోటబొమ్మాళి: మంచాలపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్ అప్పన్న



జి.సిగడాం: దవళపేట పంచాయతీలో ఉదయం 5 గంటలకే పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చందు




శ్రీకాకుళం 42వ వార్డులో గోవింద రామలక్ష్మికి పింఛను అందజేస్తున్న వలంటీర్ సాయి యశ్వంత్

అవ్వాతాతల ఆనందం మరింత పెరిగింది. ఆధారం లేని అభాగ్యుల ముఖాల్లో చిరునవ్వు కనిపించింది. నిస్సహాయుల చేతికి ఇంకాస్త సత్తువ వచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ మొత్తాన్ని రూ.2500 నుంచి రూ.2750కు పెంచడంతో లబ్ధిదారుల్లో ఆనందం కనిపించింది. పెరిగిన పింఛన్లను ఒకటే తేదీ నుంచే పంపిణీ చేయడం మొదలుపెట్టారు. తొలిరోజు సాయంత్రం ఆరు గంటలకు జిల్లాలో 70.77 శాతం మంది లబ్ధిదారులకు పింఛను అందజేశారు. మొత్తం 3,19,585 మంది లబ్ధిదారులు ఉండగా 2,26,169 మందికి పింఛను అందజేశారు.

– శ్రీకాకుళం పాతబస్టాండ్

ఇంటి పన్ను ఇక ఈజీ

- ఆన్‌లైన్‌లో ఇంటి పన్ను వసూలు
- జిల్లాలో ప్రయోగాత్మకంగా శ్రీకూర్మం పంచాయతీలో అమలు
- నిధుల దుర్వినియోగానికి చెక్ పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు
- జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న మొత్తం రూ.22 కోట్ల పైనే
- రానున్న రెండు వారాల్లో 50 శాతం లక్ష్యాన్ని సాధించేలా అధికారుల సన్నాహాలు



పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్



జిల్లాలో సుమారు రూ.22 కోట్లకు పైగానే వసూలు కావాల్సి ఉంది. అయితే వివిధ కారణాలతో పంచాయతీ అధికారులు వీటి వసూళ్లపై దృష్టి పెట్టలేదు. దీనిపై ప్రత్యేకంగా డ్రైవ్‌ను చేయనున్నాం. రానున్న రెండు వారాల్లోనే సగానికి పైగా వసూళ్లకు సన్నద్ధమవుతున్నాం. ఇప్పటికే పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశాం. వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలుంటాయి.

– వి.రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి



ఆన్‌లైన్ విధానం అమలు కానున్న శ్రీకూర్మం గ్రామమిదే..

అరసవల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి పన్నుల వసూళ్లకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చేశాయి. పంచాయతీల్లో నిధుల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పన్నులను ఆన్‌లైన్ విధానంలో వసూలు చేసేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. పన్నుల వసూలు లక్ష్యం భారీగా పేరుకుపోతోంది. ఇలాగే కొనసాగితే పంచాయతీలు ఆర్థికంగా ఇబ్బంది పడతాయి. దీంతో రానున్న మార్చి నాటికి పూర్తి స్థాయి వసూళ్ల లక్ష్యాలను సాధించేలా పంచాయతీ ఉన్నతాధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి అధికారులు కూడా ఎప్పటికప్పుడు ఈ పన్నుల (టాక్స్, నాన్ టాక్సెస్) వసూళ్లపై సమీక్షిస్తున్నారు.

పన్నుల వసూళ్లలో ఎక్కడా నిధుల దుర్వినియోగం జరుగకూడదనే ఉద్దేశంతో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ప్రయోగాత్మకంగా జిల్లాలో ఒకే పంచాయతీలో ప్రారంభిస్తున్నప్పటికీ.. క్రమేణా అన్ని మేజర్ పంచాయతీల్లోనూ.. ఆ తర్వాత మైనర్ పంచాయతీల్లోనూ ఇదే విధానాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రయోగాత్మకంగా శ్రీకూర్మంలో..

పంచాయతీల్లో పన్నుల వసూళ్లలో ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేసేందుకు వీలుగా తొలిదశలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రయోగాత్మకంగా రాష్ట్రంలో 15 పంచాయతీలను ఎంపిక చేసి ఆయా పరిధిలో అసెస్‌మెంట్ల నుంచి ఆన్‌లైన్ ద్వారా పన్నుల వసూళ్లకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో జిల్లాలో శ్రీకూర్మం మేజర్ పంచాయతీని ఎంపిక చేశారు. ఈ పంచాయతీల్లో ప్రస్తుతానికి 3841 అసెస్‌మెంట్లు ఉండగా, వీటి నుంచి వార్షిక (పెండింగ్ పన్నులతో సహా) పన్నుల డిమాండ్ లక్ష్యం రూ.14,71,912 కాగా.. ఇంతవరకు 15 శాతం మాత్రమే వసూలు చేయగలిగారు. తాజాగా తీసుకున్న నిర్ణయం మేరకు ఈ వసూళ్లను రెండు వారాల్లోనే లక్ష్యానికి చేరువయ్యేలా... ముందుగా ఆ పంచాయతీ పరిధిలో క్యూఆర్ కోడ్ స్కానింగ్/ డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా పన్నులను చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టనున్నారు. ఇందుకోసం శ్రీకూర్మం పంచాయతీ అధికారులకు పాయింట్ ఆఫ్ సేల్ డివైసెస్ (పీఓఎస్ మిషన్లు) వినియోగించేలా మిషన్లను అందుబాటులోకి తేనున్నారు.

ఆన్‌లైన్‌లో చెల్లింపులు ఇలా...

- గ్రామాల వారీగా ఇంటి యజమానుల వివరాలు, ఇంటి విస్తీర్ణం, భవన నిర్మాణం తీరు ఆధారంగా నిర్ధారించిన పన్నుల వివరాలన్నీ పీఓఎస్ మిషన్లతో అనుసంధానించిన సాఫ్ట్‌వేర్‌లో పంచాయతీ అధికారులు అప్‌లోడ్ చేస్తారు.
- పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికి ప్రత్యేక కోడ్ నంబర్ కేటాయింపు జరుగుతుంది. ఈ కోడ్ నంబర్‌ను పీఓఎస్ మిషన్‌లో నమోదు చేయగానే పన్ను చెల్లించాల్సిన మొత్తం స్క్రీన్‌పై కనిపిస్తుంది.
- ఈ పన్నుల వివరాలను బట్టి ఇంటి యజమాని ఆన్‌లైన్‌లో చెల్లించే మార్గాలను చూపిస్తుంది. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర వాటిల్లో ఎంపిక చేసుకుని క్రెడిట్/డెబిట్ కార్డు లేదా క్యూఆర్ స్కాన్ చేసి పేమెంట్ చేస్తే.. నేరుగా పంచాయతీకి చెందిన యూనియన్ బ్యాంకు ఖాతాల్లోకి ఆ నగదు జమ అవుతుంది.
- ఈ ఆన్‌లైన్ విధానం కోసం యూనియన్ బ్యాంకుల్లో పంచాయతీలు ప్రత్యేక అకౌంట్లను ఓపెన్ చేయనున్నారు. ఇలా ఈ ఖాతాల్లో జమ అయిన నగదు నేరుగా పంచాయతీ పేరిట ఉండే ట్రెజరీ అకౌంట్‌కు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విధానంతో నిధుల దుర్వినియోగానికి తావుండదు.

లక్ష్యం రూ.25.31 కోట్లు..వసూలు రూ.3.39 కోట్లే

జిల్లాలో మొత్తం 30 మండలాల్లో 912 గ్రామ పంచాయతీలుండగా, వీటిలో 11 మేజర్ పంచాయతీలున్నాయి. మొత్తంగా 4,96,651 గృహ అసెస్‌మెంట్లు ఉండగా, వీటి నుంచి 2022–23 వార్షికానికి రూ.22.02 కోట్లు వరకు టాక్స్‌ల లక్ష్యం (డిమాండ్) కాగా ఇప్పటివరకు రూ.2.32 కోట్లు మాత్రమే వసూలైంది. పంచాయతీల పరిధిలోని మార్కెట్ షాపులు, లీజుల ద్వారా నాన్ టాక్స్‌ల రూపంలో రూ.3.29 కోట్లు వరకు లక్ష్యం కాగా...ఇప్పటివరకు రూ.1.07 కోట్లు వరకు మాత్రమే వసూలైంది. దీంతో మొత్తంగా రూ.25.31 కోట్ల లక్ష్యానికి కేవలం రూ. 3.39 కోట్లు వరకు మాత్రమే ఇప్పటివరకు వసూలు జరిగింది. దీంతో రాష్ట్రంలో వసూళ్ల లక్ష్యంలో జిల్లా వెనుకబడి ఉందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో తాజాగా ఆన్‌లైన్ విధానాన్ని పరిచయం చేస్తున్న అధికారులు.. మరోవైపు మిగిలిన పంచాయతీల్లో ప్రత్యేక బృందాలుగా పన్నుల వసూళ్లకు డ్రైవ్ మొదలు పెట్టనున్నారు.

శ్రీకూర్మనాథాలయంలో ప్రత్యేక ఉత్తర ద్వార దర్శనం



శ్రీకూర్మనాథుడు

గార: ధనుర్మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శ్రీకూర్మనాథాలయంలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా శ్రీకూర్మనాథుడిని దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పించినట్లు ఆలయ ఈఓ జి.గురునాథం, ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు తెలిపారు. సోమవారం వేకువన 3 గంటలకు స్వామికి వివిధ తీర్థ జలాలు, పుష్పాలు, గంధం, వివిధ మూలికలతో ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయని, 4.45 గంటలకు ప్రత్యేకంగా గ్రామ మాడవీధుల్లో ఊరేగింపు ఉంటుందని, భక్తులు పాల్గొనాలని కోరారు. దీని కోసం ఆలయాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో పాటు పుష్పాలతో అలంకరించారు.

అరసవల్లిలో..

అరసవల్లి: వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా దర్శనాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు శ్వేత అశ్వ వాహనంలో స్వామి ఉత్సవమూర్తులకు తిరువీధి నిర్వహించనున్నారు. అనంతరం సర్వదర్శనాలన్నీ ఉత్తర ద్వారం నుంచే ఉండనున్నాయి. అలాగే అంతరాలయ దర్శనాలు నిలిపివేస్తున్నామని, సోమవారం నాడు ఎలాంటి టిక్కెట్లతో దర్శనాలుండవని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రకటించారు.

మాజీ ప్రజా ప్రతినిధి.. హతవిధీ!



మాజీ ఎమ్మెల్యే పగడాలమ్మకు నిత్యవసరాలు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కాశీబుగ్గ: చుక్క పగడాలమ్మ.. జిల్లా రాజకీయాలపై కాసింత అవగాహన ఉన్న వారందరికీ ఆమె సుపరిచితురాలే. ఒకప్పుడు పాతపట్నం ఎమ్మెల్యేగా సేవలు అందించిన ఆమె.. ఇప్పుడు రోజు గడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. నూతన ఏడాది సందర్భంగా పలాస లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆమె పరిస్థితి తెలుసుకుని పగడాలమ్మ స్వగ్రామం ముక్తాపురం వెళ్లి ఆవిడకు రెండు నెలలకు సరిపడా బియ్యం, ఇతర కిరాణా సరుకులు, కొంత నగదు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ జోనల్ చైర్మన్ లయన్ తుంబాలి సర్వేశ్వరరావు, కార్యదర్శి అట్టాడ మాధవరావు, కోశాధికారి లయన్ వడ్డి రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పింఛన్ కానుక వాల్‌పోస్టర్ విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ పింఛన్ కానుక మొత్తాన్ని పెంచిన సందర్భంగా సంబంధిత వాల్ పోస్టర్‌ను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదివారం తన కార్యాలయంలో విడుదల చేశారు. నూతన సంవత్సర కానుకగా ప్రభుత్వం పింఛన్‌ను రూ.2500 నుంచి రూ.2750 వరకు పెంచిన సంగతి తెలిసిందే. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డాక్టర్ డీవీ విద్యాసాగర్, పరిపాలన అధికారి దొర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి క్రీడాకారుల ఎంపిక



ఎంపిక ప్రక్రియకు హాజరైన క్రీడాకారులతో ఎస్ఐ సత్యనారాయణ, నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొనే బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక ఎచ్చెర్లలోని ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానంలో నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలను ఎస్ఐ వి.సత్యనారాయణ ప్రారంభించారు. బాల, బాలికల కేటగిరీల్లో ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెలాఖరులో చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జరుగుళ్ల శంకరరావు, డీఎస్ఏ ఛీఫ్‌కోచ్ ఎం.మాధురీలత, చీఫ్ రిఫరీ అజయ్‌కుమార్, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షులు మొజ్జాడ వెంకటరమణ పాల్గొన్నారు.

సందడిగా.. సంబరంగా..



ఆమదాలవలస: క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు



శ్రీకాకుళంలో న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



కాశీబుగ్గ: మంత్రి సీదిరి అప్పలరాజుకు కేక్ తినిపిస్తున్న సతీమణి శ్రీదేవి



కవిటి: నూతన సంవత్సర వేడుకల్లో జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ దంపతులు



పోలాకి: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌కు విషెస్ చెబుతున్న పార్టీ నాయకులు



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న ఎస్పీ రాధిక

నూతన ఏడాదికి జిల్లా ప్రజలు సంబరంగా స్వాగతం పలికారు. అర్ధరాత్రి నుంచే కేక్‌లు కట్ చేసి, డీజేలు పెట్టుకుని సందడి చేశారు. ప్రజా ప్రతినిధులు కూడా కూడా అభిమానులు, కార్యకర్తలతో ఉత్సాహంగా గడిపారు. కోటి ఆశలతో కొత్త ఏడాదిని ఆహ్వానించారు.

క్లుప్తంగా

డీఐజీని కలిసిన ఎస్పీ



దీఐజీ హరికృష్ణను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదివారం విశాఖపట్నం రేంజ్ కార్యాలయానికి వెళ్లి డీఐజీ ఎస్.హరికృష్ణను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమెతో పాటు అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమి శాలి, 5వ బెటాలియన్ కమాండెంట్, విజయనగరం జిల్లా ఎస్పీలు విక్రాంత్ పాటిల్, దీపికా పాటిల్ ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు



ఎగసిపడుతున్న మంటలు

కొత్తూరు: మండలంలోని వెంకటాపురం సమీపంలో శివపార్వతి రైస్ మిల్లుకు ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫారం సీటీ నుంచి ఆదివారం మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ట్రాన్స్‌ఫారాన్ని ఆనుకుని ఉన్న పిచ్చిమొక్కలకు నిప్పు అంటుకోవడంతో సిబ్బంది స్పందించి మంటలు అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ. 40 వేలు విలువైన సీటీ కాలిపోయినట్లు ట్రాన్స్‌కో ఏడీ తిరుమలరెడ్డి తెలిపారు. ప్రమాదానికి గల కారణం తెలియాల్సి ఉందని చెప్పారు.

ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 76వ నెలవారీ సాహితీ సమ్మేళనం స్థానిక శాంతినికేతన్ కళాశాలలో ఆదివారం ఘనంగా జరిగింది. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.వి.రమణమూర్తి, యు.నాగేశ్వరరావుల నిర్వహణలో 16 మంది కవులు తమ కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జంధ్యాల శరత్‌బాబు, డాక్టర్ కోమలరావు, తోట గోపాలరావు, ఉపేంద్రశర్మ, ఐఎస్‌డీ ప్రసాద్, ఈ.పాపయ్య, తంగి ఎర్రమ్మ, పి.వి. దుర్గాప్రసాద్, ఎం.రామకృష్ణ, బోగెల ఉమామహేశ్వరరావు, జి.గోపాలకృష్ణ, ఈశ్వరరావు, శ్రీనివాసరావు, కె.వి.రవికిరణ్, పాల్గొన్నారు.

కార్పొరేట్ గవర్నెన్స్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ డి.దుర్గాప్రసన్న రచించిన 'కార్పొరేట్ గవర్నెన్స్ ప్రాక్టీసెస్ ఆఫ్ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్' అనే పుస్తకాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. రచయిత వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో సబ్జెక్టు కాంట్రాక్ట్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. కార్పొరేట్ పరిశ్రమల్లో పాలన విధానం వివరిస్తూ ఈ పుస్తకాన్ని రాశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యుడు డాక్టర్ బుడుమూరు రాజేష్ పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹ 236

రహదారి సమస్యకు మోక్షం

- ఏడున్నర కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం
- 10 గ్రామాల ప్రజలకు తీరిన ప్రయాణ ఇక్కట్లు
- హామీ నిలబెట్టుకున్న ప్రజాప్రతినిధులు



పొన్నాడ-బొంతలకోడూరు బీటీ రోడ్డు



నిర్మాణానికి ముందు రోడ్డు పరిస్థితి (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: రహదారి సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. ఎచ్చెర్ల మండలం పొన్నాడ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి బొంతలకోడూరు పాతదిబ్బలపాలెం వరకు 7.7 కిలోమీటర్ల మేర కొత్తగా తారు రోడ్డు వేయడంతో పొన్నాడ, బింగిపేట, పాతపొన్నాడ, తెప్పరేవు, బొంతలకోడూరు, రుప్పపేట, ముద్దాడపేట, లావేటిపేట, పాదదిబ్బలపాలెం తదితర గ్రామాల ప్రజల ప్రయాణ కష్టాలకు మోక్షం కలిగింది. ఇన్నాళ్లూ గతుకుల రోడ్డులో ప్రయాణం చేయలేక తీవ్ర ఇబ్బందులు పడ్డామని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రోడ్డు నిర్మించడంతో ఇబ్బందులు తొలగిపోయాయని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

గత టీడీపీ హయాంలోనాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలించారు. ముద్దాడపేట వద్ద నాగావళి నదిలో ఇసుక ర్యాంపు ఏర్పాటు చేయడంతో అధికార, అనధికార పద్ధతుల్లో రాత్రీ పగలు తేడా లేకుండా ఇసుక లారీలు, ట్రాక్టర్లు ప్రయాణం సాగించడంతో రోడ్డు గోతులమయంగా మారింది. రహదారి సమస్యను స్థానికులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు పిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఈ నియోజకవర్గం నుంచి అప్పటి రాష్ట్ర మంత్రిగా కళావెంకటరావు, అప్పటి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎచ్చెర్ల జెడ్పీటీసీ సభ్యురాలు చౌదరి ధనలక్ష్మి కొనసాగినా రోడ్డు నిర్మాణం చేపట్టలేకపోయారు. 2019 ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తాము అధికారంలోకి వస్తే రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తొలుత రోడ్డు అంచనాలు, టెండర్లు వంటి ప్రక్రియల్లో అనేక అడ్డంకులు వచ్చాయి. సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, ఎంపీటీసీ మాడుగుల జగదీశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకుని ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్య తీసుకెళ్లి రోడ్డు మంజూరు చేయించారు. ఒక దశలో జనాభాపరంగా రూ.4.88 కోట్లతో రోడ్డు అవసరం లేదని అభ్యంతరాలు వచ్చాయి. దీంతో విజయనగరం జేఎన్‌టీయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్లతో కమిటీ వేశారు. అవసరాన్ని గుర్తించిన కమిటీ సభ్యులు అనుకూల నివేదిక ఇవ్వడంతో రోడ్డు నిర్మాణానికి మొదటి అడుగు పడింది.

చకచకా పనులు..

పీఎంజీఎస్‌వై ఫేజ్ –3 బ్యాచ్–2 కింద రూ. 4.89 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణానికి 2021 జూలై 16న శంకుస్థాపన చేశారు. విలేజ్ లిమిట్స్ ఎక్కువగా ఉండటంతో 3.26 కిలోమీటర్లు సిమ్మెంట్ రోడ్డు, మిగతా తారు రోడ్డు వేశారు. పనులు పూర్తికావడంతో ఇటీవల డిసెంబర్ 30న రోడ్డు మంత్రి ధర్మాన ప్రసాదరావు స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సమక్షంలో ప్రారంభించారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు పూర్తికావడంతో స్థానికులు హర్షం వ్యక్తచేస్తున్నారు.

హామీ నిలబెట్టుకున్నారు



2019 ఎన్నికల ముందు అనేక సార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లాం. అయినా పరిష్కారం కాలేదు. సార్వత్రిక ఎన్నికలు ముందు ప్రస్తుత ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. హామీ మేరకు వారు రోడ్డు మంజూరు, పనులు నిర్వహణను నిరంతరం పర్యవేక్షించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా రోడ్డు పూర్తయ్యింది.

– పంచిరెడ్డి రాంబాబు, సర్పంచ్, బొంతలకోడూరు

కృతజ్ఞతలు..



7.7 కిలోమీటర్ల పరిధిలో రెండు పెద్ద గ్రామాలు, 8 వరకు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. గతంలో రోడ్డు గోతులుగా ఉండటంతో అంబులెన్స్ వెళ్లేందుకూ ఇబ్బంది పడాల్సి వచ్చేది. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇబ్బంది పడేవారు. శాశ్వత సమస్య పరిష్కరించిన ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు.

– మాడుగుల జగదీశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు, బొంతలకోడూరు

ప్రధాన సమస్యగా గుర్తింపు..



ఎన్నికలు ప్రచారం, ఇతర కార్యక్రమాలకు స్థానికులు రోడ్డు సమస్య చెప్పేవారు. రోడ్డు నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చాను. సర్పంచ్, ఎంపీటీసీ కూడా చొరవ తీసుకున్నారు. సొంత ఖర్చులతో నిరంతరం వారు రావటం బట్టి రోడ్డు వేగంగా పూర్తి చేయాలని అనిపించేది. రోడ్డు నిర్మాణం విషయమై అధికారులను నిరంతరం అప్రమత్తం చేశాను.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎమ్మెల్యే, ఎచ్చెర్ల

గిరి ప్రదక్షిణకు వేళాయె..

పవిత్ర పర్వదినం ముక్కోటి ఏకాదశి సందర్భంగా రామతీర్థం పుణ్యక్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం తరలివచ్చే భక్తజనం కోసం అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సదుపాయం, అన్న సంతర్పణ, వైద్య శిబిరం తదితరమైనవి ఏర్పాటు చేశారు.

- నేడు రామతీర్థం పుణ్యక్షేత్రంలో గిరి ప్రదక్షిణ
- ఉదయం 5 గంటల నుంచి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనాలు
- ఏకాదశి సందర్భంగా 11 గంటలకు స్వామివారి కల్యాణం



సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలు



రామతీర్థం ఉత్తర ద్వారం

నెల్లిమర్ల: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో సోమవారం పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందు కు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేకువజామున 5 గంటల నుంచి 7.30 గంటల వరకు ఆలయంలో భక్తులకు ఉత్తరద్వార దర్శనాలు కల్పిస్తారు. 7.30 గంటలకు సీతారామలక్ష్మణుల ఉత్సవ మూర్తులను రామతీర్థం తిరువీధుల్లో మేళతాళాలతో ఊరేగిస్తారు. 8 గంటలకు నీలాచలం వద్ద మెట్లోత్సవం, గోపూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం గిరి ప్రదక్షిణ కార్యక్రమం జరుగుతుంది. 11 గంటలకు ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు.

7.30 గంటల వరకు ఉత్తరద్వార దర్శనాలు

ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా రామతీర్థం ఆలయంలో భక్తులకు ఉత్తరద్వార దర్శనాలు వేకువజామున 5 గంటల నుంచి అవకాశం కల్పిస్తారు. సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను ఉత్తర ద్వారంలో వేంచేపుచేసి, అర్చకులు ప్రత్యేక పూజలు జరిపిస్తారు. సాధారణ భక్తులను సైతం 7.30 గంటల వరకు దర్శనాలకు అనుమతిస్తారు. ఉత్తర ద్వారంలోనే భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తారు. అనంతరం లోక కల్యాణార్థం ఉత్సవ మూర్తులను రామతీర్థం తిరువీధుల్లో మేళతాళాలతో ఊరేగిస్తారు.

8 గంటలకు మెట్లోత్సవం, గోపూజ

ఏటా నిర్వహించినట్లుగానే రామతీర్థంలో ఈ ఏడాది కూడా ఉదయం 8గంటలకు మెట్లోత్సవం, గోపూజ కార్యక్రమాలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. నీలాచలం(బోడికొండ)పైకి ఎక్కే మెట్లను నీటితో శుభ్రం చేస్తారు. ప్రతి మెట్టుకు పసుపు రాసి, కుంకుమ బొట్లు పెడతారు. కొబ్బరికాయలు కొట్టి, అరటిపండ్లు నైవేద్యంగా పెట్టి, ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. అలాగే ఆలయ అర్చకులు గోవులకు ప్రత్యేకంగా పూజలు జరిపిస్తారు. ఈ కార్యక్రమాలను నిర్వహించడానికి భక్తులకు అవకాశం కల్పిస్తారు.

2015 నుంచి గిరి ప్రదక్షిణ

రామతీర్థం పుణ్యక్షేత్రంలో ప్రతి ఏటా ముక్కోటి ఏకాదశి పర్వదినాన నిర్వహించినట్లుగానే ఈ ఏడాది కూడా గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక్కడ 2015వ సంవత్సరంలో గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. మొదటి రెండేళ్లు కార్తీక పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ చేశారు. 2017 నుంచి ముక్కోటి ఏకాదశి పర్వదినాన చేపడుతున్నారు. అదే సంవత్సరంలో శ్రీరామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో నీలాచలం చుట్టూ మట్టి రహదారిని నిర్మించారు. అప్పటి నుంచి గిరి ప్రదక్షిణకు అనుకూలంగా మారింది. సోమవారం ఉదయం 8.30 గంటలకు గిరి ప్రదక్షిణ మొదలవుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.

11 గంటలకు సీతారాముల కల్యాణం

ఉదయం 11 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించనున్నారు. ఆలయంలోని లక్ష్మీదేవి సన్నిధిలో అర్చకులు కల్యాణం జరిపిస్తారు. భక్తులందరినీ కల్యాణంలో పాల్గొనడానికి అవకాశం కల్పిస్తామని అధికారులు తెలిపారు. భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారంలో దర్శనం చేసుకుని, మోక్షం పొందాలని, అలాగే మెట్లోత్సవం, గోపూజ, గిరి ప్రదక్షిణ, సీతారాముల కల్యాణం కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ప్రత్యేక కార్యక్రమాలతో పాటు సాధారణ దర్శనాలు కూడా ఉంటాయని తెలిపారు.

ఏఓబీ గ్రామాలపై ప్రత్యేక దృష్టి

- జిల్లాలో గంజాయి సాగు, నాటుసారా తయారీ లేదు
- క్రయవిక్రయదారులపై కఠిన చర్యలు
- 'సాక్షి' ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ కె.పి.గోపాల్



సెబ్ ఏసీపీ కె.పి.గోపాల్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో గంజాయి సాగు, నాటుసారా తయారీ కేంద్రాలు ఏమీ లేవని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అసిస్టెంట్ కమిషనర్ కె.పి.గోపాల్ స్పష్టం చేశారు. నాటుసారా క్రయవిక్రయాలు పక్క ఆంధ్రా ఒడిశా బోర్డర్(ఏఓబీ)ను ఆనుకొని ఉన్న గ్రామాల్లో జరుగుతుంటాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఏఓబీ గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి క్రయవిక్రయాలు జరిపే వారిలో పరివర్తన తెచ్చి ఉపాధి కల్పన చేస్తున్నట్లు చెప్పారు. సెబ్‌కు సంబంధించిన పలు అంశాలపై 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

సాక్షి: మీ తొలిపోస్టింగ్?

అధికారి : 2012లో ప్రకాశం జిల్లా మార్కాపురంలో అసిస్టెంటు ఎక్సైజ్ సూపరిండెంటుగా తొలిసారి విధుల్లో చేరాను. వివిధ జిల్లాల్లో పనిచేశాక 2021 జులైలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో అసిస్టెంటు కమిషనర్‌గా(ఇన్‌చార్జిగా) బాధ్యతలు చేపట్టాను. పోస్టు పరంగా చూసుకుంటే పలాస ఎక్సైజ్ సూపరింటెండెంట్ క్యాడర్‌లో ఉన్నాను.

సాక్షి : మీ పరిధిలో సిబ్బంది?

- కొత్తగా వచ్చిన జీవో ప్రకారం జిల్లా పరిధిలో 12 స్టేషన్లున్నాయి (గతంలో 14.. అందులో పాలకొండ మన్యం జిల్లాకు, రాజాం విజయనగరం జిల్లాలో కలిశాయి). 15 మంది సీఐలు ఉన్నారు(ఇందులో ఇంటెలిజెన్సు సీఐ, డీటీ సీఐ, చెక్‌పోస్టు సీఐ)తో పాటు 23 మంది ఎస్ఐలు, 38 మంది హెచ్‌సీలు, 148 మంది కానిస్టేబుళ్లున్నారు.

సాక్షి: సెబ్‌కు ఎక్సైజ్‌కు తేడా?

- మద్యం కొత్త పాలసీ వచ్చాక ఎక్సైజ్ శాఖ నుంచి స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో కొత్తగా చేరింది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం అమ్మకాలు, వాటి ఆదాయం, షాపుల్లో పనిచేసే ఉద్యోగుల పనితీరు తదితర అడ్మినిస్ట్రేషన్ పనులన్నీ ఎక్సైజ్ చూసుకుంటుంది. సెబ్ అనేది గంజాయి, సారా, మత్తు పదార్థాల అక్రమ రవాణా, కల్తీ మద్యాన్ని అరికట్టడం, కేసులు కట్టడం వంటివి చేస్తుంది. ఇసుక అక్రమ రవాణాను గుర్తించేంతవరకు మా చర్యలుంటాయి. తర్వాత లా అండ్ ఆర్డర్ పోలీసులకు అప్పచెబుతాం.

సాక్షి : నాటుసారా తయారీ కేంద్రాలు మన జిల్లాలో ఉన్నాయా?

- మన జిల్లాలో అటువంటి కేంద్రాలు లేవు.. కానీ ఒడిశా బోర్డరును ఆనుకొని ఉన్న ఇచ్ఛాపురం, మందస, కంచిలి, మెళియాపుట్టి, గొప్పిలి, గారబంద తదితర గ్రామాల్లో క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. వీరికి అతి సమీపంలో అంటే నాలుగైదు కిలోమీటర్లలోపే ఒడిశా ఉండటం.. ఆ రాష్ట్రంలో నాటుసారా తయారీకి లైసెన్సు ఉండటంతో వీరు అక్కడికి వెళ్లి తెచ్చుకుని అమ్ముతుంటారు. పర్లాకిమిడి కేంద్రంగా కల్తీ మద్యం తయారు చేస్తుంటారు. వాటికి తెలంగాణ లేబుల్ వేసి అమ్ముతుంటారు. అలాంటివాటిపై ప్రత్యేక నిఘా పెట్టి మాటువేస్తున్నాం. దొరికితే కఠిన చర్యలుంటాయి.

సాక్షి : ఇప్పటికి ఎన్ని కేసులు నమోదు చేశారు?

- నాటుసారా క్రయవిక్రయాలకు సంబంధించి 2022లో 94 మందిని గుర్తించి కేసులు నమోదు చేశాం. వారిలో పరివర్తన వచ్చేలా 58 మందికి (34 మందికి డీఆర్‌డీఏ, 10 మందికి ఎస్సీ కార్పొరేషన్, ఎనిమిది మందికి పలాస జాబ్‌మేళా, ముగ్గురికి ఆమదాలవలస జాబ్‌మేళా, ఎచ్చెర్ల మగ్గంపనులకు ముగ్గురి చొప్పున, మరో తొమ్మిది మంది ట్రైనింగ్ అసిస్టెంటు ఏజెన్సీలో స్వయం ఉపాధి కల్పించాం. అబ్కారీ శాఖ ద్వారా 34 మందికి రూ. 11 లక్షల రుణ చెక్కును ఎస్పీ జి.ఆర్.రాధిక, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ చేతుల మీదుగా అందించాం. మిగతా వారు గతంలోనే రుణాలు తీసుకున్నారు.

సాక్షి: గంజాయి అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు?

- మన జిల్లాలో గంజాయి సాగు లేదు. క్రయవిక్రయాలు జరుగుతున్నా వెంటనే దొరికిపోతున్నారు. 2022లో గంజాయి అక్రమ రవాణాపై 3 కేసులు కట్టాం. ముగ్గురిపై పీడీయాక్టు కట్టాం. పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద 420 గ్రాముల గంజాయి, శ్రీకాకుళం పట్టణంలో 74 కిలోలు ఒకరోజు , 135 కిలోలు మరోరోజు పట్టుబడ్డాయి..వీరు ఒడిశా రాష్ట్రం గుణుపూర్ నుంచి ముంబైకి తరలిస్తుండగా పట్టుబడ్డారు. జిల్లా కేంద్రం, ఎచ్చెర్ల పరిధిలోనూ కొన్ని కేంద్రాల్లో క్రయవిక్రయాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వారిపై నిఘా పెడతాం. కౌన్సెలింగ్ ఇస్తాం. తల్లిదండ్రులూ బాధ్యత వహించాలి.

సాక్షి: శ్రీకాకుళం సెబ్ స్టేషన్ పరిధిలో మత్తు పదార్థాల సీజ్‌తో సమకూరిన ఆదాయం?

- 2022లో మొత్తం 49 వాహనాలు సీజ్ చేశాం. రూ. 11,39,550 ఆదాయం సమకూరింది. జీఎస్టీ సొమ్ము రూ. 2,04,819.


సాక్షి : అక్రమ రవాణదారులు ఎంచుకునే మార్గాలు?

- ఒడిశా గంజాయి మాఫియా వారు బస్సులు, రైళ్లే కాకుండా కొరియర్ పాయింట్లు, లగేజీ వెహికల్స్ ద్వారా తరలిస్తుంటారు.

బ్యాడ్మింటన్‌లో దూసుకెళ్తున్న..

ఉద్దానం యువ కెరటం

- సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో అద్భుత విజయాలు సాధిస్తున్న శ్రీకర్
- ఒలింపిక్స్ లక్ష్యంగా సాధన



షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న మాదిన శ్రీకర్

కంచిలి: ఉద్దాన ప్రాంతం కంచిలి మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన మాదిన శ్రీకర్ షటిల్ బ్యాడ్మింటన్‌లో దూసుకెళ్తున్నాడు. పాఠశాల స్థాయి నుంచే పలు టోర్నీల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ అంచెలంచెలుగా ఎదుగుతున్నాడు. డిగ్రీ చదువుతున్న శ్రీకర్ ఇప్పటివరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటి శభాష్ అనిపించుకుంటున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణా అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ఎప్పటికైనా ఒలింపిక్స్‌లో ఆడి తన సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతున్నాడు. కుమారుడి ఆసక్తిని గమనించిన తండ్రి, ఉపాధ్యాయుడు మాదిన చిరంజీవులు చిన్నప్పటి నుంచే ప్రత్యేకంగా ప్రోత్సహించారు. దీంతో టోర్నీల్లో విజయఢంకా మోగిస్తున్నాడు.

విజయ విహారం..

- 2013లో చిత్తూరులో జరిగిన స్టేట్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీలో విన్నర్.
- 2013లో ఇజ్రాయిల్‌లో జరిగిన అండర్–11 విభాగం తరఫున అంతర్జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో రెండు బంగారు, వెండి పతకం కైవసం.
- 2014లో అండర్–13 విభాగంలో కడప, భగల్‌పూర్, రోహతక్, ఉడిపి, తిరుపూర్‌లలో జరిగిన పోటీల్లో సింగిల్స్‌లో స్టేట్ విన్నర్.
- 2015లో కర్నూల్ జిల్లా నంద్యాలలో జరిగిన స్కూల్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–13 విభాగంలో రన్నర్.
- 2015లో కర్నూల్ జిల్లా ఎమ్మిగనూరులో స్టేట్ ఓపెన్ మీట్‌లో విన్నర్.
- 2015 అక్టోబర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 15 ఏళ్ల విభాగంలో డబుల్స్‌లో ప్రథమస్థానం.
- 2017లో ఖేలో ఇండియా పోటీల్లో డబుల్స్‌లో రన్నరప్.
- 2017లో స్టేట్(ఎ.బి.ఎల్.) ఆంధ్రా బ్యాడ్మింటన్ లీగ్‌లో వైజాగ్ సినర్జీస్ టీం తరఫున రన్నర్.
- 2018లో ఏబీఎల్‌లో ప్రకాశం బుల్స్ ఒంగోలు తరఫున రన్నర్
- 2019 నుంచి 2022 మే వరకు కోవిడ్ కారణంగా టోర్నమెంట్స్ లేకపోవడంతో ప్రాతినిధ్యం వహించలేదు. ఈ ఏడాది అక్టోబర్‌లో నంద్యాలలో జరిగిన పోటీల్లో సీనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి రన్నర్‌గా నిలిచాడు.

• సండే సందడి



నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో కవిటి సమీపంలోని పుక్కళ్లపాలెం సముద్రతీరం ఆదివారం సందర్శకుల తాకిడితో కిటకిటలాడింది. గత మూడేళ్లు కరోనా ప్రభావంతో పెద్దగా సందర్శకులకు అనుమతి లేకపోవడం, తాజాగా ఆంక్షల్లో వెసులుబాటు ఉన్న నేపథ్యంలో తీరం జనసంద్రాన్ని తలపించింది. పెద్ద సంఖ్యలో ఫాస్ట్‌ఫుడ్, టీస్టాల్, స్నాక్స్‌స్టాల్స్ ఏర్పాటుకావడంతో జనాలు సందడి చేశారు. – కవిటి

నటరాజ నాట్యరత్న పురస్కారానికి హారిక ఎంపిక



హారికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ప్రభాకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన బీబీఏ విద్యార్థిని శ్రీశైలం హారిక ప్రతిభ కనబర్చింది. ఇటీవలి తిరుమల తిరుపతిలో ఆర్‌కే కళా సాంస్కృతిక ఫౌండేషన్ నిర్వహించిన శాస్త్రీయ నృత్య కార్యాలయంలో అద్భుత నృత్యప్రదర్శనలతో ఆకట్టుకుని నటరాజ నాట్యరత్న పురస్కారం అందుకుంది. నటరాజ నాట్యరత్న–2022 బిరుదును అందుకుని శభాష్ అనిపించింది. ప్రతిభ కనబర్చిన హారికను కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎస్.వి.వేణుగోపాల్, మేనేజ్‌మెంట్ హెచ్‌ఓడీ జె.ప్రభాకరరావు, కళాశాలల చైర్మన్ ఎస్.శేషారెడ్డి, సుగుణారెడ్డి తదితరులు అభినందించారు.

మహిళకు గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : పట్టణంలోని పీఎస్ కాలనీ సమీపంలో స్కూటీపై వెళ్తున్న మహిళను వెనుక నుంచి కారు వచ్చి ఢీకొనడంతో గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు.. పీఎస్‌కాలనీలో నివాసముంటున్న మెండ జయలలిత (42) ఏడురోడ్ల కూడలి నుంచి తన స్కూటీపై ఇంటికి వస్తుండగా పీఎస్‌కాలనీ స్టేట్‌బ్యాంకు వద్ద వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో మహిళకు పక్కటెముకల్లో గాయాలవ్వడంతో వెంటనే వైద్యం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.